క్లుప్తంగా

కరపత్రాల విడుదల

పెంట్లవెల్లి: హైదరాబాద్‌లో ఈ నెల 11వ తేదీన నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బత్తిని బాలరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాల పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాలస్వామి, కురుమయ్య, నిరంజన్, కృష్ణయ్య, యాదగిరి, రాకేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విశ్వరూప మహాసభకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. బచ్చలకూర లక్ష్మణ్, బుషపోగుల కురుమయ్య, శీలం వెంకటేష్, కద్దాల తిరుపాల్, దేవరపాగ రమేష్ ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



కొల్లాపూర్/కోడేరు: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొల్లాపూర్, తాడూరు వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కొల్లాపూర్ పట్టణ శివారు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, పెబ్బేరు రోడ్డు గుండా వచ్చే వాహనాలన్నింటినీ తనిఖీలు చేస్తున్నారు. ఆదివారం కొల్లాపూర్ వస్తున్న కాంగ్రెస్ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు వాహనాన్ని కూడా పోలీసులు తనిఖీ చేశారు. తాడూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మొత్తం 70 వాహనాలు తనిఖీ చేసినట్లు అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బల్మూర్ మండల కేంద్రంలోని గోదల్ చౌరస్తాలో ఎఫ్ఎస్‌టీ టీం అధికారి సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ

తెలకపల్లి: మండల కేంద్రంలో ఆదివారం గ్యార్మీ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని పాతగేరి వద్ద ఉన్న దర్గా వద్ద ఫాతేహ ఇచ్చారు. ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఖరీం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

సాక్షి, నెట్‌వర్క్: కల్వకుర్తి మండలంలోని మార్చాలకు చెందిన కురుమ సంఘం అధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో 25 కుటుంబాలు, పంజుగుల గ్రామానికి చెందిన 250 మంది ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా కొంతమంది కురుమిద్దె, వెల్దండ మండలంలోని కొట్ర గ్రామస్తులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తాడూరు మండలంలోని ఆకునెల్లికుదురు, పాపగల్, తిరుమలాపురం గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సమక్షంలో చేరారు. కోడేరులో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు, పెంట్లవెల్లిలో వార్డు మెంబర్ సుజాతసూర్యనారాయణ మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

ఫొటోగ్రాఫర్‌కి ఆర్థికసాయం



ఊర్కొండ: మండలంలోని మాదారం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ చలపతి అనారోగ్యంతో బాధపడుతూ దాదాపు నెలరోజులపాటు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఇటీవల కోలుకొని డిశ్చార్జ్ అయ్యాడు. విషయం తెలుసుకున్న తోటి ఫొటోగ్రాఫర్స్ ఖర్చుల నిమిత్తం చలపతికి రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫొటో యూనియన్ మండల అధ్యక్షుడు సిద్దు, డివిజన్ అధ్యక్షుడు రవి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నర్సి, ఫొటోగ్రాఫర్లు సూరిబాబు, జాఫర్, నిరంజన్, నాగరాజు, సోహెల్, బాబా తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలపై అవగాహన

సాక్షి, నెట్‌వర్క్: కోడేరు మండలంలోని నర్సాయిపల్లి, ముత్తిరెడ్డిపల్లిలో ఆదివారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై ఆయన ఓటర్లకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పెంట్లవెల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

నేడు బీసీ గర్జన

కొల్లాపూర్ రూరల్: పట్టణంలో అబ్దుల్‌కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని ఫౌండేషన్ అధ్యక్షుడు సింగోటం రామన్న కోరారు. ఆదివారం మండలంలోని సింగోటంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన పార్టీల్లో బీజేపీ మాత్రమే బీసీకి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిందని వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి మద్దతు తెలుపుతామన్నారు. నాయకులు, పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు పనులు



రోడ్డు వెంట మట్టిని వేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు ఇటీవల బీటీ రెన్యూవల్ పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారు. రోడ్డుకు ఇరువైపులా మట్టిని వేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా రోడ్డుకు మరమ్మతు చేపట్టకపోవడంతో మర్రిపల్లి వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనాలు వెళ్లలేని పరిస్థితికి చేరుకుంది. దీంతో వాహనదారులు ఎన్నో మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. ఎట్టకేలకు సంబంధిత కాంట్రాక్టర్ రెండు నెలల కిందట బీటీ రోడ్డు రెన్యూవల్ పనులు చేపట్టారు. రోడ్డు వెంట సమాంతరంగా మట్టిని వేయాలని నిబంధనలు ఉన్నా మట్టిని వేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సింగిల్‌రోడ్డుపై రెండు ఎదురెదురు వాహనాలు వెళ్లడం కష్టంగా ఉందని ఆయా గ్రామస్తులు వాపోయారు. ద్విచక్ర వాహనాలు రోడ్డు పక్కకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డు వెంట మట్టిని వేయించాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గిరిజనుల పక్షాన పోరాడుతా



మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్: గిరిజనుల పక్షాన వారి హక్కుల సాధన కోసం పోరాడుతానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గిరిజన సంఘాల నాయకులతో సమావేశం అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులను సంఘటితం చేసేందుకోసం ఈనెల 14న కోడేరు మండలంలోని ఎత్తం గట్టు పరిసర ప్రాంతంలో నియోజకవర్గస్థాయి గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సమ్మేళనానికి గిరిజనులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో పలువురు గిరిజన నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు సమన్యాయం



మాట్లాడుతున్న ఎంపీ రాములు

పెంట్లవెల్లి: బీఆర్ఎస్‌తోనే సబ్బండవర్గాలకు సమన్యాయం జరుగుతుందని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇంటింటికి వెళ్లి సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టిన పథకాలు ఓటర్లకు వివరించాలన్నారు. నాలుగు సంవత్సరాలలోనే ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో మతీన్, రాజేష్, వెంకటేశ్వర్లు, విజయరామారావు, సురేందర్‌గౌడ్, శేషు, విష్ణుగౌడ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన నాయకులు



కురుమిద్దె నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఆమనగల్లులో నిర్వహించిన బీఆర్ఎస్ సభకు భారీగా తరలివెళ్లారు. ముఖ్యఅతిథిగా ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రావడంతో కార్యకర్తలతో పాటు ప్రజలు తరలివెళ్లారు. ఈసందర్భంగా వెల్దండ మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పుట్ట రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఐజాక్, వెంకటేశ్వర్‌రావు, వెంకటయ్యగౌడు, భాస్కర్‌రావు, నిరంజన్, వెంకటయ్యముదిరాజ్, మల్లయ్య, దేవేందర్, శివముదిరాజ్, శేఖర్, గజినిశ్రీను, రాము, వెంకటయ్య, శేఖర్‌ముదిరాజ్, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు ఉన్నారు.

చారకొండ: ఆమన్‌గల్‌లో మంత్రి కేటీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు మండలంలోని జూపల్లి, చంద్రాయన్‌పల్లి, గోకారం, జేపల్లి, ఎర్రవల్లి, అప్పారెడ్డి గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. జూపల్లి వద్ద అందరు కలుసుకొని ర్యాలీగా బయలుదేరారు. జూపల్లి భాస్కర్ రావు, బాలేమియా, ఎంపీడీసీ శ్రీనివాస్ రెడ్డి, అప్పల శేఖర్, భగవాన్ గౌడ్, సర్పంచ్ రవీందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జగపతి, సీరాజ్, తిర్పతయ్య చారి, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గంలోని ఆమన్‌గల్‌లో ప్రజా ఆశీర్వాద సభకు హాజరయ్యారు. ఈ సభకు కల్వకుర్తి మండలంలోని 24 గ్రామాల పరిధి నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు ఆమన్‌గల్ వైపు దండు కట్టారు. ట్రాక్టర్లు, ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో భారీ సంఖ్యలో ఆమన్‌గల్‌కు కదిలారు.

చికిత్స పొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి

మల్దకల్: చదువుకోవాలని తండ్రి మందలించడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ విద్యార్థి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఏఎస్ఐ ఈశ్వరయ్య కథనం ప్రకారం.. మండలంలోని మద్దెలబండకు చెందిన తిరుమలయ్య, గోవిందమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు సురేష్(20) గద్వాలలో డిగ్రీ చదువుకుంటున్నాడు. గత నెలలో సురేష్ ఇంటికి రావడంతో తండ్రి చదువుకోవాలని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ గత నెల 27న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని, ఈ ఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

శాంతినగర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలిలా.. మండలంలోని కొంకలకు చెందిన తెలిగి గుడిసె శ్రీనివాసులు, ఇట్లపురం శ్రీను, టీజీ రామకృష్ణ శనివారం శాంతినగర్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గుడిసె శ్రీనివాసులు శనివారం మృతిచెందాడు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాసులుకు భార్యతోపాటు ముగ్గురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గల్లంతైన మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని షేరిల్లీవీధికి చెందిన ఖమ్రాబేగం (33)కు అయిజకు చెందిన అబిద్ హుసెన్‌తో 10 సంవత్సరాల కిందట వివాహమైంది. నాలుగు నెలల నుంచి భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో భర్త తన ఇద్దరు పిల్లలను తీసుకుని అయిజకు వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటూ కలత చెంది శనివారం రాత్రి పిజేపి కుడి కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రి గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ మహిళ ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం జములమ్మ రిజర్వాయర్‌లో గల్లంతైన మహిళ మృతదేహం తేలడంతో జాలర్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. తమ్ముడు జావెద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



మన్ననూర్‌లోని పాత బజార్ కాలనీలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



తెలకపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థులు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి మద్దతుగా ఆదివారం ఆయా మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. కొల్లాపూర్ బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్ రావు మద్దతుగా పట్టణంలో ఇంటింటికి ప్రచారం చేశారు. బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్‌కు మద్దతుగా తెలకపల్లిలో ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

వలస ఓటర్లతో సమావేశం



అచ్చంపేట రూరల్: నల్లమలలో రోజు రోజుకు రాజకీయం వేడెక్కుతుంది. రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఇప్పటికే ఎవరి అంచనాలు వారికి ఉండగా తాజాగా హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలు ఓటర్లలో ఆసక్తి కనబర్చుతున్నాయి. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉండే ఓటర్లపై పార్టీల అభ్యర్థులు దృష్టి సారించారు. హైదరాబాద్ నగరంలో వలస వెళ్లిన ఓటర్లకు అభ్యర్థులు గాలం వేస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు గువ్వల బాలరాజు, డాక్టర్ వంశీకృష్ణ హైదరాబాద్‌లో వలస వెళ్లిన ఓటర్ల వద్దకు వెళ్లి తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్‌కు చెందిన అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నిజామొద్దీన్ చేరగా, బీఆర్ఎస్‌లో బీఎస్పీకి చెందిన వెంకటస్వామి, ఇతర పార్టీల నాయకులు చేరారు. కాగా పదర జెడ్పీటీసీ సభ్యుడు మూడావత్ రాంబాబు నాయక్ తండ్రి మూడావత్ పర్వతాలు కాంగ్రెస్ పార్టీలో చేరడం చర్చనీయాంశమైంది.

తండాల అభివృద్ధికి కృషి



చారకొండ: మండలంలోని నేమలిగుట్ట తండా, దొంగల గుట్ట తండాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జూపల్లి వెంకట్ యాదవ్ అన్నారు. ఆదివారం జూపల్లిలో ఆయా తండాలకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నకల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డికి మద్దతుగా తెలపాలని కోరారు. ఇటీవల తండాలలో సీసీగా రోడ్డు వేయడంతో తండావాసులు వెంకట్ యాదవ్‌కు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బాషు నాయక్, హనుంత్, పాండు, అశోక్, మునిరాం, సోమ్లా, శ్రీను, జ్యోతిరాం, సురేష్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

తెలకపల్లి: మండలంలోని మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో ఎంపీపీ మధు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు విధిగా ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

ఇథనాల్ కంపెనీ నుంచి కాపాడాలని ఆత్మహత్యాయత్నం

మరికల్: ఇథనాల్ కంపెనీ నుంచి చిత్తనూర్ గ్రామంతో పాటు ఇతర గ్రామాలను కాపాడాలని ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చిత్తనూర్‌కి చెందిన భాస్కర్ గాంధీభవన్ వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా.. కంపెనీ నుంచి తమ గ్రామం వదిలి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, నా చావుతోనైన కంపెనీ రద్దు చేయాలని కోరారు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే తేరుకుని ఆత్మహత్యాయత్నం చేసుకోకుండా అతడిని అడ్డుకున్నారు. కంపెనీ రద్దు చేసే వరకు తమ ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తామన్నారు. ఇప్పటికే ఇథనాల్ కంపెనీ నుంచి వచ్చే విషాధ్రవాలతో మూగజీవాలతో పాటు ప్రజలు కూడా రకరకాల వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏఎన్ఎంకు నంది అవార్డు



నంది అవార్డు అందుకున్న లక్ష్మీకుమారి

తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీకుమారి నంది అవార్డు వరించింది. ఆదివారం హైదరాబాద్‌లో సినీ నటుడు అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా వేలూరు ఫౌండేషన్ సభ్యులు వైద్య రంగంలో ఏఎన్ఎం సేవలను గుర్తించారు. ఇందులో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నంది అవార్డును ఆమెకు అందజేశారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



మాట్లాడుతున్న వంశీకృష్ణ

బల్మూర్: కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం చేకూరుతుందని అచ్చంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. పేదల ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటుతో ఆదరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

అందరికి విద్య, వైద్యం అందిస్తాం



దివ్యాంగుడిని ఓటు అడుగుతున్న ఆచారీ

కల్వకుర్తిరూరల్: సమాజంలోని అందరి బాగు కోసం అందరికి విద్యా, వైద్యం అందించడమే బీజేపీ ధ్యేయమని కల్వకుర్తి అభ్యర్థి ఆచారీ అన్నారు. ఆదివారం మండలంలోని రఘుపతిపేట, పంజుగుల, కల్వకుర్తి పట్టణం విద్యానగర్‌లో ఆచారీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఒకసారి అవకాశం ఇస్తే సేవకుడిగా పనిచేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, కృష్ణగౌడ్, శేఖర్‌గౌడ్, బాలస్వామి, కిష్టారెడ్డి తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

నియోజక అభివృద్ధే ధ్యేయం

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పంజుగుల, ముకురాల గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అశోక్‌రెడ్డి, ఆనంద్ కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా చెట్ల తొలగింపు



పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి సిద్ధేశ్వరం వరకు నేషనల్ హైవే 165 అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను ఇష్టానుసారంగా తొలగిస్తున్నారు. మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి రోడ్డుపైనే మొద్దులు వేస్తున్నారు. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి చెట్లను కోసి రోడ్డుపై ఇష్టానుసారంగా వేయడంతో ట్రాఫిక్ జాం అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. చెట్ల తొలగింపును రాత్రివేళ చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



తాడూరు: మండల కేంద్రం నుంచి ఎండబెట్ల మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే బీటీ రోడ్డు తాడూరు సమీపాన, ఎండబెట్ల సమీపంలో ఉన్న రెండు కల్వర్టుల దగ్గర వారం రోజుల కిందట సీసీ రోడ్డు నిర్మించారు. కాని క్యూరింగ్ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇలా ఉంటే సీసీ రోడ్డు నిర్మాణం కొన్నాళ్ల ముచ్చటగానే మిగులుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. ప్రభుత్వ నిధులు ఎన్ని వెచ్చించినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగమేనని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్యూరింగ్ చేయాలని కోరుతున్నారు.

బైక్ ర్యాలీ



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రం నుంచి బిజినేపల్లి మండలంలోని పాలెం గ్రామం వరకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ నిర్వహించారు. మూడు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వయంగా రాజేష్‌రెడ్డి బైక్ నడుపుతూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

బీఆర్ఎస్‌లో చేరిక



కొల్లాపూర్: పట్టణంలోని 17వ వార్డు వడ్డెర కాలనీ వాసులు ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం తిరిగి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తల్లి బిచ్చమ్మ సమక్షంలో బీఆర్ఎస్ గూటికి చేరారు. పార్టీలో చేరిన వారిలో వడ్డె బీసన్న, ఎలగొండ వెంకటయ్యతో పాటు పలువురు ఉన్నారు.

కోడేరు: మండల కేంద్రానికి చెందిన 53మంది నాయకులు ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు, సర్పంచ్ వెంకటస్వామి ఆధ్వర్యంలో వడ్డెర గుడిసెలకు చెందిన వారు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, నర్సింహ్మారెడ్డి, రాజు, స్వామి, యాపచెట్టు లాలు తదితరులు పాల్గొన్నారు.